క్లుప్తంగా

9న డీఏఓల నిరసన

నాంపల్లి: డీఏఓల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 9న గురువారం నాంపల్లిలోని గృహకల్ప భవన సముదాయంలోని ఆర్థిక శాఖ వర్క్స్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన, ధర్నా చేయుటకు నిర్ణయించామని టీజీఓ అనుబంధ సంఘం రాష్ట్ర డివిజనల్ అకౌంట్స్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మహమ్మద్ మొహిద్దీన్, రాధా రమణారెడ్డి, కోశాధికారి హాషం ఓ ప్రకటనలో తెలిపారు. డీఏఓ అధికారులకు సంబంధించి 22 సాధారణ సర్వీసు సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. కోడల్ రూల్స్‌కు విరుద్ధంగా పలు ఇంజినీరింగ్ శాఖల్లో తమ బాధ్యతలకు సంబంధంలేని అధికారులు, దురాక్రమణ చేస్తున్నప్పటికీ చోద్యం చూస్తున్నారని, సర్వీస్ రూల్స్, ప్రమోషన్ల విషయాల్లో కూడా తాత్సారం వహిస్తున్న కారణంగా తమ కేడర్ నిర్వీర్యం అయ్యే పరిస్థితి వస్తుందని వాపోయారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



పూజల్లో శ్రీకాంత్ చారి తదితరులు

గోల్కొండ: దుర్గాదేవి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. టోలిచౌకి, షేక్‌పేట్, కార్వాన్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో దుర్గమ్మకు జరిగిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఈ పూజల్లో టోలిచౌకి బీజేపీ డివిజన్ నాయకుడు బొమ్మల శ్రీకాంత్ చారి దంపతులు అమ్మవారి జరిగిన ప్రత్యేక పూజలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్

గౌలిపురా: రౌడీషీటర్లు ఎలాంటి నేర కార్యాకలాపాలకు పాల్పడకూదని సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్ సూచించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం ఏసీపీ మహ్మద్ గౌస్ భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉంటూ సమాజంలో మంచి వ్యక్తులుగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీ, ఎస్సైలు రాఘవేందర్ రెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఏక్తా పార్టీ హైదరాబాద్ అధ్యక్షుడిగా నర్సింగ్‌రావు



నర్సింగ్‌రావుకు నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: ప్రజా ఏక్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం మహారాజ్‌గంజ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ నర్సింగ్‌రావుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. పార్టీని పటిష్టం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మణికంఠ, ముఖేష్ మేరు, రాఖేష్, శ్రీనివాస్, నాగేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం



స్కూల్ డైరెక్టర్ గాలయ్య, ప్రిన్సిపాల్ జయశ్రీని సన్మానిస్తున్న కార్పొరేటర్ దర్శన్

జియాగూడ: జియాగూడలో 30 ఏళ్ల నుంచి స్కూల్ నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయడం హర్షణీయమని జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. ఈ మేరకు సోమవారం లక్ష్మీనరసింహానగర్ విఘ్నేశ్వర హైస్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు, గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ మండల్ రేంజ్–1 డిప్యూటీ ఐఓఎస్ అజేందర్‌రెడ్డి, అక్షదీప్ జూనియర్ కాలేజెస్ డైరెక్టర్ మహ్మద్ అక్రమ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

గోల్కొండ/అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై అత్యధికులు స్వాగతం పలుకుతున్నారు. మరోవైపు ఇది ఎన్నికల బడ్జెట్ అంటూ మరికొందరు అభిప్రాయపడుతున్నారు. విద్యారంగానికి సరైన బడ్జెట్ కేటాయించలేదని, దీని వల్ల విద్యారంగానికి తీరని లోటు అని పలువురు విద్యావంతులు అంటున్నారు. కేవలం రుణమాఫీకే రూ.6 వేల కోట్లకు పైగా కేటాయించడం ఎన్నికల స్టంట్ అని పలువురు అంటున్నారు. ఎక్కువగా బడ్జెట్‌లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేటాయింపులు జరిగాయని నిరుద్యోగ యువత అంటున్నారు. అయితే నిరుద్యోగులు, రైతుల కోసం ఈ బడ్జెట్ వల్ల ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఇది బెస్ట్ బడ్జెట్..



బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన బడ్జెట్లలో అన్నింటి కంటే ఇది బెస్ట్ బడ్జెట్. ప్రజా సంక్షేమం, వైద్య విద్యా రంగాలకు అధిక నిధులు కేటాయించబడ్డాయి. రైతు పక్షపాతి అయిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ప్రత్యేక నిధులు కేటాయించింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇదే అత్యుత్తమైన బడ్జెట్.

– జీవన్‌సింగ్, బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జ్

ఇది పక్కా ఎన్నికల బడ్జెట్..



ఇది ప్రజలకు మభ్యపెట్టే బడ్జెట్. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ సూచనల మేరకు రూపొందించిన బడ్జెట్. ప్రగతి నిధి అంటూ నిధి పేరుతో షెడ్యూల్డ్ కులాల కోసం కేటాయించిన నిధులకు లెక్క చెప్పాలి. విద్యారంగానికి సరైన నిధులు కేటాయించడం లేదు.

– కృష్ణ, కాంగ్రెస్ నాయకుడు కార్వాన్

అభివృద్ధి సంక్షేమాలకు పెద్దపీట..



రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి సంక్షేమాలకు పెద్దపీట వేశారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా మంత్రి హరీష్‌రావు బడ్జెట్ రూపుదిద్దుకుంది. రైతుబంధు, దళితబంధు, రైతు బీమాతో పాటు అన్నివర్గాలకు ఉపయోగకరమైన బడ్జెట్ ప్రవేశపెట్టారు. రాష్ట్ర చరిత్రలోనే అన్నివర్గాల ప్రజల కోసం అనుకూలమైన బడ్జెట్.

– ఆశీష్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు

అవార్డుల ప్రదానం



సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని మాస్టర్ కిడ్స్ అకాడమీ ఆధ్వర్యంలో 4వ రాష్ట్ర స్థాయి నైపుణ్య పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 1500 మందికి పైగా విద్యార్థులు 6 విభాగాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలకు సంబంధించిన అవార్డు ప్రదానోత్సవాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వేదికగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాస్టర్ కిడ్స్ అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్ మోనికా, లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ నిధి గేరా, కనక్ మాధవ పెద్ది, లక్ష్మీరెడ్డి, డాక్టర్ వినీత్ గేరా తదితరులు అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు.

పాతబస్తీ మెట్రోకు రూ.500 కోట్ల కేటాయింపు హర్షణీయం



మాట్లాడుతున్న మహ్మద్ సలావుద్దీన్ లోధీ

చార్మినార్: సీఎం కేసీఆర్ ఆలోచనలకు అద్దంపట్టే విధంగా.. ప్రజల ఆకాంక్షలు నెరవేరే విధంగా 2023–24 వార్షిక బడ్జెట్ ఉందని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ కొనియాడారు. సోమవారం పురానీహవేలీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మెట్రో రైలు నిర్మాణ పనుల కోసం ఈ వార్షిక బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించడం సంతోషకరమన్నారు. ఈ సమావేశంలో మొఘల్‌పురా డివిజన్ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బి.దాస్, పత్తర్‌గట్టి డివిజన్ యువజన నాయకులు అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ప్రదీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: అనాథాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు సహాయ సహకారాలు అందిస్తూ అనాథ చిన్నారులకు ఉన్నత చదువు కోసం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ప్రదీప్‌కుమార్‌ను సన్మానించడం ఆనందంగా ఉందని తెలంగాణ మేధావుల ఫోరం చైర్మన్ డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం నానక్‌రామ్ భగవాన్ దాస్ సైన్స్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ప్రదీప్‌కుమార్ ప్రపంచ దేశాలు పర్యటిస్తూ అనేక ఎంఎన్‌సీ ఫార్మసిటికల్ కంపెనీలకు సలహాదారుల వ్యవహరిస్తున్నారని తెలిపారు. 45 ఏళ్ల అనంతరం కళాశాల స్నేహితులను కలుసుకున్న ఆయన తన అనుభవాలను పంచుకున్నారని, ఈ సందర్భంగా ఆయను సన్మానించామన్నారు. రవీంద్రకుమార్, అజయ్ సింగ్ ఠాకూర్, జగన్‌మోహన్‌రెడ్డి, జగదీష్, మాజీ ఏపీపీఎస్సీ సభ్యులు సీతారా మరాజు, డాక్టర్ ధర్మతేజ ఆర్య, వి ప్రేమ్‌రాజ్, డాక్టర్ కమలేష్ శర్మ, కేపి హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన ఓపెన్ టెన్నిస్ పోటీలు



గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా ఎల్బీ స్టేడియంలో జరిగిన 12వ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఖమ్మం జిల్లా సెషన్స్ జడ్జి అపర్ణ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ పోటీలలో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో గాయత్రి చంద్రశేఖర్ జోడి గెలువగా, నంద్యాల నర్సింహారెడ్డి జోడి రన్నరప్‌గా నిలిచింది. మహిళ విభాగంలో నీలం అగర్వాల్ బృందం గెలుపొందింది. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నీల్‌కాంత్, హరికృష్ణారెడ్డి, రియాజ్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ తదితరులు

అబిడ్స్: ఎంప్లాయిస్ హెల్త్‌కార్డులు అమలు చేస్తామని ప్రకటించినందుకు హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎసం ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రులు హరీష్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ కవిత, సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాయికంటి ప్రతాప్‌కు ముజీబ్ హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచేస్తున్న ఉద్యోగుల కల నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, శంకర్, ఖాలీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లాల్‌సింగ్, దర్పల్లి నర్సిములు, కాంతిలాల్

జియాగూడ: సంత్ రవిదాస్ మహారాజ్ సమాజ శ్రేయస్సుకు ఎంతో కృషి చేశారని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, రాష్ట్ర బీజేపీ గొర్ల కాపరుల సెల్ కో కన్వీనర్ దర్పల్లి నర్సిములు అన్నారు. ఈ మేరకు సోమవారం జియాగూడ సంజయ్‌నగర్‌లో గల సంత్ రవిదాస్ ఆలయంలో తెలంగాణ రాష్ట్ర సంత్ రవిదాస్ మోచీ సమాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆయన జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జియాగూడ దుర్గానగర్ నుంచి సంత్‌రవిదాస్ ఊరేగింపు ఆలయానికి చేరుకోగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు మహేష్కర్ కాంతిలాల్, ఉపాధ్యక్షులు మనోహర్‌లాల్ పురవే, వినోద్‌కుమార్, దయాలాల్, కోశాధికారి మనోహర్ మహోరే, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముఖేష్ మాహోరే, కార్యదర్శి పి.తుల్జేష్ పాల్గొన్నారు.

అభినందనలు



మంత్రి హరీష్‌రావును కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, వేణుగోపాల్

అబిడ్స్: తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ చరిత్రలో ఎంతో భేష్‌గా ఉందని మంత్రి హరీష్‌రావుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వేణుగోపాల్ అభినందనలు తెలిపారు. సోమవారం మంత్రిని కలిసి ఈ దఫా బడ్జెట్ అన్నివర్గాలకు అందలం ఎక్కించే విధంగా ఉందని వారు మంత్రితో పేర్కొన్నారు.

కొనసాగుతున్న హజ్రత్ అలీ జయంత్యుత్సవాలు



బాల్‌శెట్టికేత్‌లో కొనసాగుతున్న మేళా

డబీర్‌పురా: హజ్రత్ అలీ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని డబీర్‌పురా బాల్‌శెట్టికేత్‌లో మేళాలు కొనసాగుతున్నాయి. ఈ మేళాలలో ప్రజలు పాల్గొని పలు వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా 13వ రజ్జబ్ నుంచి 22వ రజ్జబ్ వరకు మేళాలు కొనసాగుతున్నాయి.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వంశీ రామరాజు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జేవీ పబ్లికేషన్ ఆధ్వర్యంలో 77 మంది రచయితలు రచించిన పిల్లలు చెప్పిన పాఠాలు పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. పలువురు రచయితల సంకలనాలను ఒకే వేదికపై తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు, రచయిత్రి సుధాదేవి, జేవీ.పబ్లికేషన్ సంపాదకులు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు ఎస్‌బీఐ చేయూత



సాక్షి, సిటీబ్యూరో: దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా టీబీ వ్యాధిని నిర్మూలించడం కోసం కృషి చేస్తున్న 'ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా అమరావతి కేంద్రంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేయూతనందించింది. ఆంధ్రప్రదేశ్‌లోని వెయ్యి మంది టీబీ బాధితుల సంరక్షణకు న్యూట్రీషన్ అందించడానికి ఎస్‌బీఐ ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన రూ.37.29 లక్షల చెక్కును ఎస్‌బీఐ చైర్మన్ దినేస్ కుమార్ ఖారా స్థానిక స్వచ్ఛంద సంస్థ 'కనెక్ట్ టు ఆంధ్ర'కు అందించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో టీబీ బాధితులకు అవసరమైన సేవలు అందిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు నవీన్ చంద్ర ఝా, గుండు రావు, కిషన్ శర్మ, ఓం నారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర 2023-24 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్ రావు సోమవారం ప్రవేశ పెట్టిన సందర్భంగా అసెంబ్లీకి హాజరైన ఎంఐఎం ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, ముంతాజ్ అహ్మద్ ఖాన్, సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రీ, జాఫర్ హుస్సేన్ మిరాజ్, మొజాంఖాన్, అఫ్సర్ ఖాన్

నిరుపేదలకు మజ్లిస్ అండ: ఎమ్మెల్యే కౌసర్



మేరాజ్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నిరుపేదలు, దివ్యాంగులకు మజ్లిస్ పార్టీ అండగా ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఉదయం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజెన్స్ ఆయనకు తమకు ఆసరా పింఛన్లు సమయానికి రావడం లేదని ఫిర్యాదు చేశారు ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు మంజూరు అయ్యాయని, అయితే సాంకేతిక కారణాల కారణంగా కొన్ని దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి వాటిని కూడా త్వరలోనే పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆయన అన్నారు. వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికి తమ ఇంటి ముందు నీళ్లు నిలుస్తున్నాయని ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది వర్షపు నీరు రోడ్లపై నిలిచే పరిస్థితి ఉండదని ఆయన స్పష్టం చేశారు. వరదనీరు సాఫీగా ముందుకు వెళ్లేలా డ్రైనేజీ నిర్మాణం చేపట్టామన్నారు. మజ్లిస్ నాయకులు జబ్బార్, జాకెర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్-కేవీలో చేరిన మజ్దూర్ మోర్చా నాయకులు



వెంకటేష్ సమక్షంలో యూనియన్‌లో చేరిన నాయకులు

యాకుత్‌పురా: జీహెచ్ఎంసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఆర్ఎస్–కేవీ) ప్రధాన కార్యదర్శి వెంకటేష్ అన్నారు. చార్మినార్ జోన్ బీజేపీ మజ్దూర్ మోర్చాకు చెందిన పలువురు నాయకులు సోమవారం తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఆర్ఎస్–కేవీ)లో చేరారు. యూనియన్‌లో చేరిన మజ్దూర్ మోర్చా చార్మినార్ జోన్ అధ్యక్షుడు సునీల్‌కుమార్‌తో పాటు ఓంసింగ్, లక్ష్మణ్, సత్యనారాయణ, శ్రీనాయక్, మహేష్, సంపత్, వినోద్‌కుమార్, రాజ్‌కుమార్, యాదగిరి, శివకుమార్‌కు వెంకటేష్ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. తమ యూనియన్ అధ్యక్షుడు బాలకృష్ణ సారథ్యంలో రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్–కేవీ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు దాసన్న, ఎల్లమయ్య, చార్మినార్ జోన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విభాగం అధ్యక్షుడు కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హరికథ మహోత్సవాలు



నాగరాణిని సన్మానిస్తున్న కేవీ.రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి జన్మదినం సందర్భంగా ఐదు రోజులుగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న హరికథ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం ప్రముఖ భాగవతారిణి వావిలాల నాగరాణిచే నిర్వహించిన భక్త మార్కండేయ హరికథగానం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి, ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, రచయిత దాసరి వెంకటరమణ, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు



కార్యక్రమంలో వహీద్ అహ్మద్ తదితరులు

గోల్కొండ: కులమతాలకు అతీతంగా పేదలకు ఉచితంగా న్యాయసేవలు అందించేందుకు కొత్తగా లీగల్ వ్యాగన్ అనే సంస్థను ఏర్పాటు చేశామని ముస్లిం అడ్వొకేట్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ వహీద్ అహ్మద్ అన్నారు. సోమవారం టోలిచౌకిలో విరాట్‌నగర్‌కుంటలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ న్యాయవాదులు పేదలకు న్యాయ సలహాలు అందించేందుకు లీగల్ వ్యాగన్‌ను స్థాపించడం జరిగిందన్నారు. అకారణంగా ఎందరో పేదలు బెయిల్ పొందలేక జైళ్లలో మగ్గుతున్నారన్నారు. అటువంటి వారి వివరాలు తెలుసుకుని వారు నిర్దోషులుగా నిర్ధారించుకున్న తరువాత వారికి బెయిల్ ఇచ్చి వారి పక్షాన నిలబడుతామన్నారు. ఈ సందర్భంగా వహీద్ అహ్మద్‌ను స్థానికులు సన్మానించారు. మహ్మద్ బిలాల్, సలాం, మహ్మద్ ఒవైస్ ఉద్దీన్ తదితరులున్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



బహుమతులు అందజేస్తున్న మెట్టు వెంకటేష్

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటేష్ పేర్కొన్నారు. ఆర్‌కేఎస్‌కేఏ ఫౌండర్ కరాటే లక్ష్మీ సామ్రాజ్యం, చీఫ్ ఆర్గనైజర్ వి.రవి ఆధ్వర్యంలో జరిగిన మూడో జాతీయ ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ ఆల్ స్టైల్ చాంపియన్‌షిప్ విజేతలకు ఆయన బహుమతులు, షీల్డ్‌లను అందజేశారు. అనంతరం మెట్టు వెంకటేష్ మాట్లాడుతూ.. తెలంగాణలో క్రీడాకారుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాల ముందుంటుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించే విధంగా ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందన్నారు. కిట్టు, రాజు తదితరులు పాల్గొన్నారు.

షేక్‌పేట్ అభివృద్ధికి అధికారులు సహకరించాలి



గోల్కొండ: షేక్‌పేట్ అభివృద్ధికి అధికారులు సహకరించాలని షేక్‌పేట్ కార్పొరేటర్, బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన బల్దియా సూపరింటెండెంటింగ్ ఇంజినీర్ రత్నాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన షేక్‌పేట్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల విషయంపై చర్చించారు. నిధులు మంజూరై కూడా ఇప్పటి వరకు ప్రారంభంకాని పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు. పలు పనులు మధ్యలోనే ఆగిపోయాయని, ఈ విషయంపై ప్రజలు ప్రతి నిత్యం తనను అడుగుతున్నారన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తికాకపోతే తాను ప్రజలకు జవాబు ఇవ్వలేకపోతున్నానని పేర్కొన్నారు. షేక్‌పేట్‌లో ఇంకా ఎన్నో ప్రాంతాల్లో రోడ్డు పనులు జరగాల్సి ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఈఈ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని పరిరక్షించుకోవాలి

గన్‌ఫౌండ్రీ: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో సమయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో అనంత పేరిట ప్రముఖ నృత్య కళాకారిణి రాధిక శిష్యబృందం చేసిన భరత నాట్య పారాయణం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీ ఫొటోగ్రాఫర్ సెంతల్ కుమార్, సంస్థ వైస్ చైర్మన్ గోనె వంశీకృష్ణ తదతరులు పాల్గొన్నారు.